ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా...

- ఐదుగురు విద్యార్థులకు గాయాలు -ప్రాణాపాయం నుండి బయటపడ్డ 25 మంది విద్యార్థులు

విశాలాంధ్ర-మందస: మందస నుండి భైరసారంగపురం వైపు వెళ్తున్న వివేకానంద హై స్కూల్ బస్సు శనివారం సాయంత్రం ఉమాగిరి గ్రామం వద్ద అదుపుతప్పి చెరువులో పడింది. బస్సులో 35 మంది విద్యార్థులు ఉన్నారు. చెరువులో బస్సు పడిపోయిన వెంటనే ఉమాగిరి గ్రామ ప్రజలు చెరువులో దిగి బస్సు డ్రైవర్ ను, 35 మంది విద్యార్థులను ప్రాణాపాయం లేకుండా రక్షించారు. ఐదుగురు విద్యార్థులకు గాయాలు కావడంతో 108 వాహనంలో హరిపురం ప్రాథమిక ఆసుపత్రిలో చేర్పించడంతో వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. సంఘటన జరిగిన స్థలాన్ని మందస ఎస్ ఐ కె. కృష్ణ ప్రసాద్ పరిశీలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణరావు జరిగిన సంఘటనపై ఆరా తీసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

త్వరలో రైతులకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.

విశాలాంధ్ర-టెక్కలి/ కోటబొమ్మాళి: త్వరలో రైతులకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం కోటబొమ్మాళి పార్టీ కార్యాలయంలోప్రజల నుంచి వినతులు స్వకరించారు. ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, రైతులు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వైద్య సదుపాయాలు కల్పించాలని, గ్రామ మత్స్య సహాయకులుగా పనిచేస్తున్న తమకు పదోన్నతులు కల్పించాలని, ఎన్టీఆర్ వైద్య సేవల్లో విధులు నిర్వహిస్తున్న తమకు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ వినతలను మంత్రికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మాజీ శాసన సభ్యులు కలమట వెంకటరమణ, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాలలో థర్మల్ పవర్ ప్లాంట్ ను రద్దు చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశం లో

సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ప్రకృతి సిద్ధమైన గిరిజన ప్రాంతమైన బూర్జ, సరుబుజ్జిలి మండలాలలో సుమారు 23 గ్రామాల కొండల మధ్యలో థర్మల్ పవర్ ప్లాంట్ ను నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండడం అన్యాయమని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. పట్టణం లో ఒక ప్రైవేట్ హాలులో ఆదివాసీ సంక్షేమ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి అధ్యక్షతన శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాపర వెంకటరమణ మాట్లాడుతూ థర్మల్ ప్లాంట్ కు వ్యతిరేకంగా శ్రీకాకుళం జిల్లాలో సోంపేట, కాకరపల్లి లో థర్మల్ వ్యతిరేక పోరాటాన్ని విజయవంతమైన తర్వాత థర్మల్ ప్లాంట్ స్థాపన సరికాదని ప్రభుత్వాలు విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. దానికి విరుద్ధంగా పచ్చటి ప్రాంతాలలో, నీటి వసతి లేకపోయినా థర్మల్ ప్లాంట్ నిర్మించడం అంటే వంశధార, నాగావళి నీటిని థర్మల్ ప్లాంట్ మళ్లించడానికి ప్రభుత్వం ప్రయత్నంలో భాగమే అని ఆయన అన్నారు. దీనివలన వంశధార, నాగావళి ప్రాంతం ఎడారిగా మారుతుందని అన్నారు. ఆ ప్రాంతాలలో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్ణయాన్ని విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ ఎం ఎల్ న్యు డెమోక్రసీ లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి లు మాట్లాడుతూ పవర్ ప్లాంట్ నిర్మాణం తో జిల్లా కాలుష్య కోరల్లో చిక్కుకుని, జిల్లా లో పచ్చదనం లేకుండా పోతుందన్నారు. కాలుష్య రహిత పరిశ్రమలు నిర్మిస్తే ఎవరూ అడ్డు చెప్పరని, కానీ పాలకులకు జిల్లా అంటే కేవలం పవర్ ప్లాంట్ లే ఏర్పాటు చెయ్యాలనే ఆలోచన రావడం దుర్మార్గం అన్నారు. గిరి ప్రాంతాల్లో కూడా ఇలాంటి కాలుష్య పరిశ్రమలు నిర్మిస్తే ఆక్సిజన్ కూడా కార్పొరేట్ ఆ వద్ద కొనాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఇలాంటి పరిశ్రమల తో జిల్లా కు నష్టమే తప్ప లాభం ఉండదని, ప్రతీ ఒక్కరూ ఈ పరిశ్రమ ఏర్పాటు ను వ్యతిరేకించాలన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు కే.వి.జగన్నాథం, వైసిపి ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, వైసిపి నాయకులు తమ్మినేని చిరంజీవినాగ్, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రి దానేష్, సోంపేట పోరాట కమిటీ నాయకులు బీల.ఢిల్లీరావు, బీసీ సంఘం నాయకులు చౌదరి లక్ష్మీనారాయణ, డిటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కోత ల ధర్మారావు, కేఎంపిఎస్ నాయకులు బెలమల ప్రభాకర్, పోరాట కమిటీ అధ్యక్షులు సురేష్ దొర, ప్రధాన కార్యదర్శి రవికాంత్, మహిళా సంఘం అధ్యక్షురాలు కృష్ణవేణి, కాకరపల్లి పోరాట కమిటీ అధ్యక్షుడు హన్నురావు, సరుబుజ్జిలి జడ్పిటిసి నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి. సంతోష్, కొన్న శ్రీనివాసరావు అదేవిధంగా వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన ప్రతి ఒక్కరికి అవసరం

జిల్లా వైద్యాధికారి బాల మురళీకృష్ణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: స్థానిక కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీకాకుళం జిల్లా వైద్యాధికారి బాల మురళీకృష్ణ మాట్లాడుతూ అవయదానంపై అవగాహన లేక, ఎవరూ ముందుకు రావటంలేదని, అవయవదానం చేయడంవలన కొంతమంది జీవితాలలో వెలుగులు చూడచ్చని, మనం లేకపోయినా, జీవించినట్లేనన్నారు. అవయవాలు కోసం ఎంతో మంది జీవన్ దాన్ ద్వారా ఎదురు చూస్తున్నారని, అవయవాలు పనితీరు, దానం చేయడానికి ఉపయోగపడే అవయవాలు కోసం విద్యార్థినిలకు తెలియజేశారు. శ్రీకాకుళంలో పదేళ్ల బాలుడు సైతం తన అవయవాలను దానం చేశారని, వారి తల్లితండ్రులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రాణాలు కాపాడటంలో బాగమయ్యారని గుర్తుచేశారు. విశిష్ట అతిథి రెడ్ క్రాస్ మేనేజర్ జి.రమణ మాట్లాడుతూ మన దేశంలో రోజూ రోడ్డు ప్రమాదాల్లో వందల మంది చనిపోతున్నారని, బ్రెయిన్ డెడ్ , ఇతర కారణాలతో చనిపోయిన వారి అవయవాల్ని ఇతరులకు అమర్చటం ద్వారా మరెన్నో కుటుంబాలకు మేలు చేసినట్లు అవుతుందని ఇంతకంటే గొప్పదానం ఏముంటుందన్నారు. కళాశాల డైరెక్టర్ బివిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ అవయవదానం పై అపోహలు వీడి ముందుకు రావాలని, వాటి అవసరం, ప్రాముఖ్యతను ఇతరులకు తెలియజేస్తే మరొకరికి జీవితాన్నిచ్చేవాళ్లవు తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె. వేణు, ఎన్ ఎస్ఎస్ పిఓ ఎల్. మోహనరావు,రెడ్ క్రాస్ మేనేజర్ రమణ, సేవకులు ఉర్లం శివతేజ, విద్యార్థినిలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో స్వచ్ఛంద్రా డే

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో శనివారం స్వచ్ఛంద్రా డే నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత వలే పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. వర్సిటీలో మొక్కలు నాటి, రోడ్లను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఓఎస్ఓ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ

- డయల్ 100,112 కాల్స్ పట్ల తక్షణమే స్పందించాలి

విశాలాంధ్ర-ఆమదాలవలస: జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి శుక్రవారం అర్ధ రాత్రి ఒంటి, రెండు గంటల సమయాన ఆముదాల వలస, పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశా రు. ఈ క్రమంలో జిల్లా ఎస్పి స్టేషన్లో రాత్రి పహారా (సెంట్రి) సిబ్బంది వివరాలు,ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో కేటాయించిన బీట్ల సిబ్బంది వివరాలు, వారు తిరిగే బీట్ పాయింట్లు ఆరా తీసి, బీట్ సిబ్బంది ప్రతి ఒక్కరు అప్రమత్తంగా పకడ్బందీగా గస్తీ విధులు నిర్వర్తించాలని తెలిపారు. సెంట్రీ కానిస్టేబుల్ అప్రమత్తంగా ఉంటూ జిల్లా పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి వచ్చే డయల్ 100, 112 కాల్స్ పట్ల తక్షణమే స్పందించి, ఆయా పరిధిలో గల బీట్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ సంబంధిత ఫిర్యాదితో ఫోన్ ద్వారా మాట్లాడి బాధితులు ఉన్న చోటకు చేరుకుని సమస్య పరి ష్కారానికి నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి వేళలో ఆపదతో పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి,వారి సమస్య ల పట్ల సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టే దిశగా విధులు నిర్వర్తించి, ప్రతి విషయాన్ని అధికారులకు తెలియజేయాలన్నారు. అనుమా నం ఉన్న ప్రతి వాహనాన్ని,వ్యక్తిని క్షుణ్ణంగా పరి శీలించి నేర నియంత్రణ చర్యలు చేపట్టాలని బీట్ సిబ్బంది విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి సూచించారు.

ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులకు సంపూర్ణ ఏర్పాట్లు చేయండి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

విశాలాంధ్ర-శ్రీకాకుళం: వచ్చే నెల 1 నుండి 20 వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరగనున్నాయి. దీనిలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో ఈ పరీక్షల్లో హాజరుకానున్న విద్యార్థులకు ఎటువంటి సౌకర్యవంతమైన ఏర్పాట్లుచేస్తున్నారో తెలుసుకునేందుకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారులతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొందు సీతారాం శనివారం పట్టణంలోని ఆర్ ఐఒ కార్యాలయంలో జిల్లా పర్యవేక్షణ అధికారి,పరీక్ష కమిటీ సభ్యులు, ప్రిన్సిపాళ్ళు, ఫ్లయింగ్ స్క్వాడ్,ఇతర శాఖల అధికారులతో భేటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఆర్ఐఒ,పి.దుర్గారావు సారథ్యం వహించారు, ఈ భేటీకి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం జిల్లా వ్యాప్తంగా ఈ విద్యా సంవత్సరంలో ఎన్ని పరీక్షా కేంద్రాలు,జోన్లు ఏర్పాటు చేశారు. హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య ఎంత,వీరిలో బాలికలు,బాలురు ఎంతమంది,ఎన్ని ప్రభుత్వ కళా శాలలు, ఎన్ని ప్రైవేటువి కేటాయించారు,సంపూర్ణ సదుపాయాల ఏర్పాటులో భాగంగా త్రాగు నీటి సదుపాయం, చక్కని వెలుతురు,పరిశుభ్రవంతమైన మరుగు దొడ్లు,ఫ్యాన్లు,సరిపడినన్ని బెంచ్ లు,కుర్చీలు ఏర్పాటు చేసేలా సంభందిత కళాశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేశారా,పరీక్షలు జరగనున్న కేంద్రాల పరిధిలో విద్యుత్ సమస్యలు లేకుండా,సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సంభందిత శాఖాధికారుల దృష్టికి తెచ్చారా,అలాగే మారుమూల ప్రాంతాల్లోని కళాశాలలకు హాజరయ్యే విద్యార్థులకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా విరివిగా బస్ లు ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ అధికారులకు ముందస్తు ప్రణాళికలు అందజేశారా,ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారా,పరీక్ష కేంద్రాల ప్రాంగణాల్లో ప్రాథమిక వైద్యంతో ముడిపడి ఉండేలా సరిపడా మందులతో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసేలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారితో సంప్రదింపులు జరిపారా,సిసి కెమెరాలు ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు,సమస్యాత్మక పరీక్ష కేంద్రాలున్నాయా, వాటిపై ఎటువంటి చర్యలు చేపడుతున్నారు, తదితర అంశాలపై సుదీర్ఘంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమంలో భాగంగా ఈ వార్షిక పరీక్షల్లో వసతులు లేమి, ట్రాఫిక్ నిబంధనల ఇక్కట్లు,అనారోగ్య సమస్యలు, రోడ్ రవాణా ఇబ్బందులతో ఏ ఒక్క విద్యార్థి పరీక్షలను కోల్పోకుండా పూర్తి ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే తమ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు సారధ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఎస్పీలకు వివిధ సూచనలు, సలహాలు, ఆదేశాలు జారీచేసినట్టు తెలిపారు. జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.దుర్గారావు మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి తగు సలహాలు సూచనలు అందజేశారు అన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల నుండి మొదటి,రెండో సంవత్సరం విద్యార్థిని,విద్యార్థులు మొత్తం 75 పరీక్ష కేంద్రాల నుండి 40356 మంది,వీరిలో ఒకేషనల్ 2380 మంది హాజరవుతున్నారని,వీరిలో మొదటి ఏడాది 20389 మంది,రెండో ఏడాది 19967 మంది విద్యార్థులు ఉన్నారని వివరించారు,పర్యవేక్షణకు 1600 మంది ఇన్విజిలేటర్లు,1480 సీసీ కెమెరాలు అమర్చుతున్నామని వివరించారు,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచనలు,ఆదేశాలు అమలులో భాగంగా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద సంపూర్ణ ఏర్పాట్లు జరిగేలా ప్రణాళికాయుత చర్యలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో పరీక్షలను విజయవంతం చేస్తామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరీక్ష కమిటీ సభ్యులు భీమేశ్వర రావు,నారాయణ రావు,సింహాచలం,శ్యాం,వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు,ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు,ఎం. వాసుదేవ కుమార్,కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన కలిశెట్టి

విశాలాంధ్ర-రణస్థలం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన డీజీపీ గా బాధ్యతలు స్వీకరించిన హరీష్ కుమార్ గుప్తా ని విజయనగరం పార్లమెంట్ సభ్యులు, ఐటీ/కమ్యూనికేషన్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

చెత్త నుండి సంపద తయారీ చేద్దాం...

విశాలాంధ్ర- హిరమండలం: తడిచెత్త, పొడి చెత్త, మరియు ప్రమాద కరమైన చెత్త ను వేరు వేరు గా చేసి చెత్త నుంచి సంపద తయారీ చేయాలని ఎంపీడీఓ ఆర్ కాశీ ప్రసాద్ రావు, తహసీల్దార్ ఎన్ హనుమంత్ రావు లు కోరారు. హిరమండలం మేజర్ పంచాయతీ చెత్త తయారీ కేంద్రం ను శనివారం పంచాయతీ ఈఓ టి హరికృష్ణ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళ లు తో ప్రతిజ్ఞ చేశారు, ఈ సందర్భంగా స్వర్ణాంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా హిరమండలం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గల చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద డ్వాక్రా గ్రూపుమహిళల కి తడి చెత్త పొడి చెత్త ప్రమాదకరమైన చెత్త వేరు చేయుట మరియు వానపాము ఎరువు తయారు చేయుట తదితరఅంశాలు అవగాహన కల్పించారు. అనంతరం డ్వాక్రా గ్రూప్ మహిళలతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వెలుగు ఎ పి ఎం సాయి లక్ష్మి, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా గ్రూప్ సభ్యులు, పంచాయతీ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

2 కేజీల 600 గ్రాముల గంజాయి స్వాధీనం

తమిళనాడు గంజాయి ముఠా అరెస్ట్



విశాలాంధ్ర-మందస: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న తమిళనాడు ముఠాను మందస పోలీసులు అరెస్టు చేసి రెండు కేజీల 600 గ్రాముల గంజాయి ను స్వాధీనం చేసుకున్నారు.శనివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు తమిళనాడుకు చెందిన మైఖేల్, రాజరాజన్ అని ఇద్దరు వ్యక్తులు తమిళనాడు నుండి బయలుదేరి ఒరిస్సా చేరుకుని గంజాయి అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. బరంపురం కు చెందిన ఒక గుర్తు తెలియని వ్యక్తి నుండి గంజాయి తీసుకొని ఎవరికి అనుమానం రాకుండా మందస రోడ్డు రైల్వే స్టేషన్ కు చేరుకున్నారు. సమాచారం అందుకున్న మందస ఎస్.ఐ కె.కృష్ణప్రసాద్ పోలీస్ సిబ్బందితో శుక్రవారం మందస రైల్వే స్టేషన్ లో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న మైఖేల్, రాజరాజన్ ను అదుపులోకి తీసుకొని 2 కేజీల 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాశీబుగ్గ డిఎస్పి వెంకటప్పారావు, సిఐ తిరుపతిరావు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు విలేకరులకు తెలిపారు.

ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కారం

ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తేవాలని సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. శ్రీకాకుళం, గార, శ్రీకాకుళ పట్టణంలోని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులు సంప్రదించి సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వములో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలపవచ్చని తక్షణమే చర్యలకు ఆదేశాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, సమస్యలు పరిష్కారం వెంటనే జరుగుతుందని తెలిపారు. సమస్యలు పరిష్కరించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు ఈ ప్రజా దర్బార్ కు అధిక సంఖ్యలో ప్రజల వచ్చి సమస్యలపై వినతలు సమర్పించారు.

శ్రీనివాసున్ని దర్శించుకున్న జిల్లా జడ్జి

విశాలాంధ్ర-సోంపేట: సోంపేటలో గల జిల్లా కోర్టు 6వ అదనపు న్యాయమూర్తి కె.కిషోర్‌బాబు పట్టణంలోని వైభవ వెంకటేశ్వరస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పొందూరు తిరుపతి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు సాయిశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి న్యాయమూర్తి కిషోర్‌బాబుకు, హాజరైన హైకోర్టు సిబ్బందికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ కిషోర్‌బాబుకు స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడు మృతి

తాడివలసలో విషాదం

విశాలాంధ్ర-పొందూరు: ఉపాధికోసం కొనుగోలు చేసిన వాహనమే. ఉసురుతీసింది. కుటుంబపోషనకు అండగా ఉంటుదని భావించే నమ్ముకున్న ట్రాక్టరే కుటుంబానికి దూరం చేసింది. ఆనందంగా ట్రాక్టర్తో ఇంటినుంచి బయలుదేరిన వ్యక్తిని ఆట్రాక్టరే బలితీసుకుంది. ఈ విషాదం పొందూరు మండలం తాడివలస గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలుమేరకు మండలం తాడివలసకు చెందిన తమ్మినేని భాస్కరరావు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్దినెలలు క్రితం అదనపు ఆదాయం కోసం ట్రాక్టర్ కొనుగోలు చేసి వ్యవసాయపనులు, దుక్కులకు వెళుతున్నాడు. ఎప్పటిలాగే శనివారం ఉదయం 5 గంటలకు వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్పై ఆమదాలవలస మండలం బెలమామం బయలుదేరాడు. అయితే ప్రత్యక్షసాక్షు ల తెలిపిన సమాచారం మేరకు బెలమామం సమీపంలో రోడ్డుప్రక్కన ఉన్న పొలాల్లో బోల్తాకొట్టింది. ఈ ప్రాంతంలో రోడ్డుకు, పోలాలకు మధ్య లోతు ఎక్కువగా ఉండడంతో ట్రాక్టర్ తిరగబడడంతో ట్రాక్టర్ క్రింద చిక్కుకుపోయిన భాస్కరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలో ఉన్న గ్రామస్తులు వచ్చి ట్రాక్టర్ను తీసి బాస్కరరావును బయటకు తీసినప్పటికే మృతిచెంది ఉన్నాడు. భాస్కరరావు మృతిచెందిన విషయం తెలిసి మృతుడి భార్య రమణమ్మ అక్కడికక్కడే కుప్పకూలింది. ఘటనాస్థలానికి చేరుకున్న భార్య, కుటుంబ సభ్యులు విఠితజీవిగా ఉన్న భాస్కరరావును చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఆమ దాలవలస ఎస్సై బాలరాజు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ జరిపారు. శవపం చనామా నిర్వహించి మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ కు తరలించారు. అందరితో మంచిగా ఉంటే బాస్కరరావు మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

చెత్త సేకరణతోనే గ్రామాల పరిశుభ్రత

- జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్

- నివాస గృహాలకు వెళ్లి తడి చెత్త- పొడి చెత్త పై అవగాహన

సంపద తయారీ కేంద్రం పరిశీలిస్తున్న కలెక్టర్

విశాలాంధ్ర-టెక్కలి: చెత్త సేకరణతోనే గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల నుంచి తడి చెత్త పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ అన్నారు. మండల కేంద్రంలో స్థానిక జిల్లా ఆసుపత్రి సమీపంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా ఎక్కువగా వర్మీ తయారికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. చెత్త సంపద కేంద్రం నిర్వహణపై అధికారులతో, సిబ్బందితో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. తడి చెత్త-పొడి చెత్త అంశాలపై ఎలా స్వీకరిస్తారని, దాన్ని ఎలా వినియోగిస్తారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా పర్యటించి పలు నివాసగృహాలను సందర్శించారు. ఇళ్ల వద్ద ఉన్న తడి చెత్త -పొడి చెత్తను గురించి స్వయంగా జిల్లా కలెక్టర్ చేతులతో వేరు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. మన చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మనం మన పిల్లలు ఆరోగ్యాలు సురక్షితంగా ఉంటాయని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు తెలిపారు.అధికారులు పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసి, సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేసే సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ భారతి సౌజన్య, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం కృష్ణమూర్తి, ఎంపీడీవో లక్ష్మీబాయి, ఈవో జగన్నాధరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు ఏపీపీగా 'దువ్వు'



విశాలాంధ్ర-మందస: మందస మండలం బెల్లు పట్టియా గ్రామానికి చెందిన దువ్వు జగన్నాయకులు సోంపేట అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ ఏపీపీగా నియమితులయ్యారు. టిడిపి లీగల్ సెల్ కన్వీనర్ గా గత ఐదు సంవత్సరాలు కార్యకర్తలకు అండగా ఉంటూ న్యాయ పరమైన విశేష సేవలు అందించిన దువ్వు జగన్నాయకులు ఏపీపీగా నియమితులయిన సందర్భంగా మందస మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియమితులు కావడానికి విశేషంగా కృషి చేసిన పలాస నియోజకవర్గ శాసనసభ్యులు గౌతు శిరీష ,ఇచ్ఛాపురం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ బాబు ,రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ లకు దువ్వు ధన్యవాదాలు తెలిపారు.

జర్మన్ యువతి సైకిల్ యాత్ర

విశాలాంధ్ర-కవిటి: జర్మన్ దేశానికి చెందిన ఎమ్మా ఇగ్లస్సియ ప్రపంచ దేశాల పర్యటనలో భాగంగా కలకత్తా నుంచి కేరళ వరకు సైకిల్ యాత్ర చేస్తున్నారు.అందులో భాగంగా శనివారం కవిటి మండలం భైరిపురం గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న దేశాల సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు తెలుసుకొనేందుకు తాను ఈ పర్యటన చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే 951 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేశానని మరో 1800 కిలోమీటర్లు యాత్ర చేయనున్నట్లు తెలిపారు.

రైతుల విశిష్ట ప్రత్యేక గుర్తింపు సంఖ్యలో జిల్లా ఫస్ట్

- జిల్లాలో ఆముదాలవలస ఫస్ట్

- ఏవో మెట్ట మోహనరావు

విశాలాంధ్ర-ఆమదాలవలస: రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య 25% నమోదుతో శ్రీకాకుళం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, అలాగే ఆముదాలవలస 23 రైతు సేవా కేంద్రాల పరిధిలో 28% నమోదు చేసి జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నామని ఆముదాలవలస వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు తెలి పారు. వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా రైతులకు అందించడానికి వ్యవ సాయ రైతు సంక్షేమ మంత్రత్వ శాఖ, రాష్ట్ర వ్యవ సాయ శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. రైతు గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ వలన రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్ లో నమోదవుతుందని వివరించారు. నమోదు ప్రక్రియ ప్రారంభించి అనతి కాలంలోనే జిల్లా వ్యాప్తంగా 25% నమోదు జరి గింది. రైతుల సంఖ్య 241316 వుండగా ఇప్పటి వరకు 60 256 రైతులు వారి ఐడి నమోదును పూర్తి చేసుకున్నట్లు వివరించారు. మండలంలో 23 రైతు సేవ కేంద్రాల్లో 7295 మంది రైతులు ఉండగా 2042 మంది నమోదు ప్రక్రియ పూర్తి చేసుకుని 28%తో జిల్లాలో ప్రథమ స్థానంలో మండలం ఉందన్నారు. ఇది ఇలా ఉండగా అత్య ధిక రైతులు ఉన్న కత్యాచార్యుల పేట, టీ జొన్న వలస లలో సర్వర్ల లోపంతో నమోదు సంఖ్య తగ్గిందన్నారు. కలివరం లో ఇంకా నమోదు ప్రారంభం కాలేదు. అలాగే మెట్టక్కివలస, ఆము దాలవలస, కృష్ణాపురం, లక్ష్మిడిపేట ఆర్ఎస్కేలు పరిధిలో ఒకరిద్ద రైతులు మాత్రమే నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రభుత్వ పథకాలు వారి విశిష్ట సంఖ్యల ద్వారా అందుతాయని వివరించారు. రైతులందరూ పూర్తిగా తన సంబంధిత ఆర్ ఎస్ కె ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

దివ్యాంగుల గుర్తింపు సర్వే పక్కాగా నిర్వహించాలి

విశాలాంధ్ర - పొందూరు : దివ్యాంగులకు ప్రభుత్వాలు అందిస్తున్న సం క్షేమపథకాలు దివ్యాంగుల దరిచేరాలంటే దివ్యాంగుల సర్వే, గుర్తింపు పక్కాగా నిర్వహించాలని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. హైకోర్టు ఆదేశాలమేరకు దివ్యాంగుల సర్వేపై పొందూరు. జి.సిగడాం మండలాల పలుశాఖల సిబ్బందితో కోర్టు సమావేశ భవనంలో సమావేశం నిర్వహించారు. ప్రతీ ఇంటికీ వెళ్ళి పక్కాగా గుర్తింపు జరగాలని సూచించారు. దివ్యాంగుల గుర్తింపుకు సదరన్ దృవపత్రమే ప్రామాణికం కాదని, సదరన్ దృవపత్రాలు లేని దివ్యాం గులను గుర్తించి నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సచివాలయ మహిళాపోలీసులు ఆశావర్కర్లు. ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సంస్కృతిలో ఓ భాగం

- విలువ తెలియని ప్రభుత్వాలు
- గ్రంథాలయ సెస్ రూ.710 కోట్లు ఏమయ్యాయి?
- పునర్వికాస ఉద్యమానికి శ్రీకాకుళం నుంచి శ్రీకారం

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ప్రభుత్వాల అలసత్వం ఫలితంగా నిర్వీర్యమైన గ్రంథాలయ వ్యవస్థ పునర్వికాస ఉద్యమానికి శ్రీకాకుళంలో శ్రీకారం జరిగింది. ఈ సందర్భంగా, ఉద్యమ సంఘం రాష్ట్ర కన్వీనర్, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం క్రింద అడిగితే, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి తప్ప మిగిలిన పూర్వ పదకొండు జిల్లాల నుంచి సమాచారం అందిందని చెప్పారు. దాని ప్రకారం ప్రజల నుంచి గ్రంథాలయాల పన్ను పేరుతో వసూలు చేసిన ఎనిమిది శాతం రూ.737.25 కోట్లు కాగా, ఖర్చు చేసింది. రూ.17.47 కోట్లు మాత్రమేనని చెప్పారు. గ్రంథాలయాల సెస్ పేరుతో వసూలు చేసిన సొమ్మును 1983 వరకు ప్రభుత్వాలు గ్రంథాలయాల నిర్వహణ, అభివృద్ధి కోసమే ఖర్చు పెట్టేవని తెలిపారు. ఆ తరువాత గ్రంథాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ వచ్చారని, గ్రంథాలయాల సెస్ ను ఇతర ఖర్చులకోసం మళ్లించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర ఉద్యమంలో భాగంగా గ్రంథాలయ ఉద్యమం కూడా పెద్దలు అయ్యంకి వెంకటరమణయ్య ,వెలగా వెంకటప్పయ్య వంటి వారు నడిపారని, స్వాతంత్ర ఉద్యమము కోసం అవసరమైన చైతన్యాన్ని గ్రంథాలయాలు అందించాలని గుర్తు చేశారు. మురుగు రాష్ట్రమైన కర్ణాటకలో 4300 గ్రామీణ గ్రంథాలయాలు ఉండగా ,ప్రస్తుతం ఆ సంఖ్య 9 వేలకు చేరిందని చెబుతూ, జాతీయ స్థాయి గ్రంథాలయ చరిత్రను వివరించారు. శ్రీకాకుళం ఎన్జీవో హెూం లో శనివారం ఉదయం అరసం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యుడు నల్లి ధర్మారావు అధ్యక్షతన జరిగిన ఉద్యమ ప్రారంభోత్సవానికి, అరసం జాతీయ అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, పాలకులు దేవాలయాలపై ఉన్న శ్రద్ధ గ్రంథాలయాలపై చూపటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఏనాడో చెప్పిన సత్యాన్ని లక్ష్మీనారాయణ ఉటంకించారు. ఆలయాలు యాచకుల్ని పెంచుతాయని, గ్రంథాలయాలు మేధావుల్ని పెంచుతాయని అన్న సత్యాన్ని గుర్తు చేశారు. మేధావులు పెరిగితే, ప్రభుత్వాలను ప్రశ్నించే వారి సంఖ్య ఎక్కువ అవుతుంది గనుక, ప్రభుత్వాలు గ్రంథాలయాల అభివృద్ధి పట్ల ఉద్దేశపూర్వకంగా చిన్నచూపు చూస్తున్నాయనే అనుమానం కలుగుతుందని అన్నారు. అనేక సామాజిక ఉద్యమాల వెనుక గ్రంథాలు, గ్రంథాలయాల పాత్ర ఉందని చెప్పారు. భారత రాజ్యాంగ రచన కోసం డాక్టర్ అంబేద్కర్ గ్రంథాలయాల వల్లనే విలువైన సమాచారం సేకరించారని గుర్తు చేశారు. ప్రముఖ రచయిత అంటాడు అప్పలనాయుడు మాట్లాడుతూ, ఒకప్పుడు గ్రామ పంచాయతీల స్థాయిలో గ్రంథాలయాలు ఉండేదని, ఇప్పుడు అవి కనుమరుగయ్యాయని, వాటిలోనే చదివి తామెంతో విజ్ఞానాన్ని పెంచుకున్నామని గుర్తు చేసుకున్నారు. నేను అనే భావన నుంచి మనం అనే స్థాయికి సమాజాన్ని తెచ్చింది గ్రంథాలయమేనని చెప్పారు.అరసం రాష్ట్ర కార్యదర్శి శరత్ చంద్ర జ్యోతి శ్రీ మాట్లాడుతూ, కొత్త తరాల జ్ఞాన వికాసానికి ఈ పునర్వికాస ఉద్యమం అవసరమని, అభ్యుదయం కోసం తపించే మేధావి వర్గం ఈ ఉద్యమంలో భాగస్వాముల కావాలని కోరారు. విశ్రాంత జిల్లా విద్యాశాఖ అధికారి బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లాలో ప్రైవేటు గ్రంథాలయాల ప్రగతిని వివరించారు. వాటి నిర్వాహకులను కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములను చేయాలని కోరారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కే శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ ఉద్యమానికి తమ సంస్థ పూర్తి మద్దతును ప్రకటిస్తుందని చెప్పారు. ఇటీవల మరణించిన అభ్యుదయ ఉద్యమ నాయకుడు వీజీకే మూర్తి పేరుతో ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసే ఆలోచన ఉన్నట్టు చెప్పారు. ఈ గ్రంథాలయానికి పదివేల రూపాయలు విలువ గల పుస్తకాలను అందజేస్తానని ఈ సందర్భంగా అధ్యక్షత గురజాడ జయనపీఠం గురజాడవహించిన నల్లి ధర్మారావు ప్రకటించారు. విద్యా సంస్థల అధినేత జామి భీమశంకర రావు, గురజాడ అధ్యయన పీఠం అధ్యక్షురాలు పత్తి సుమతి, బూర్జ మండల ఉపాధ్యక్షుడు బుడుమూరు సూర్యారావు, సిపిఐ పట్టణ కార్యదర్శి టి తిరుపతిరావు, అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు, విశ్రాంత ఇంజనీర్ బి ఎ మోహన రావు, ఇస్కఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి మల్లేశ్వరరావు, జీవి నాగభూషణరావు, పాలకొండ డివిజన్ గ్రంథాలయ ఉద్యమ నాయకులు సుబ్బా నానాజీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామాగ్రి అందజేత

విశాలాంధ్ర - సోంపేట : జై భీమ్ సేన ఆధ్వర్యంలో ఇందిరమ్మపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు అంబేద్కర్ చిత్రపటంతో కూడిన నోట్ పుస్తకాలు, విద్యా సామాగ్రిని విద్యార్థులందరికీ సోంపేట మండల విద్యాశాఖ అధికారులు ఎస్.జొరాడు, జె.కృష్ణంరాజుల చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కు చదువు పట్ల ఆయనకున్న శ్రద్ధ భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించడంలో సహాయపడింది అని తెలుపుతూ తన కుటుంబాన్ని కూడా లెక్కచేయకుండా చదువే తన జీవితంగా భావిస్తూ ప్రపంచ దేశాలలో చదివిన ప్రపంచ మేధావి, విశ్వ జ్ఞాని అంబేద్కర్. ప్రపంచ విజ్ఞానిగా మారాడని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ సేన జిల్లా అధ్యక్షులు బిస్క ఈశ్వర రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.విజయనిర్మల, ఉపాధ్యాయులు కె.హరీష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

శ్రీరామమందిరం ప్రారంభం

విశాలాంధ్ర - రణస్థలం : మండలం చిన లంకపేట గ్రామం లో నిర్మించిన శ్రీ రామ ఆలయ ప్రారంభ మరియు ప్రత్యేక పూజ కార్యక్రమంలో దేవుని ప్రార్థిస్తూ ప్రతి ఒక్క గ్రామంలో రామాలయం ఉండాలని ఆ రాముడు కరుణ పంచాయతీ ప్రజలందరపై ఉండి సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట బానోజీ నాయుడు బానోజీ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు తేజ బాబు మరియు ఈ కార్యక్రమం లో ఎంపిటిసి ప్రతినిధి మజ్జి వెంకటరమణ, కరిమిజ్జి భాస్కర్, రావు వాల్ రమణ, పంపు రెడ్డి అప్పలనాయుడు, జనసేన సువ్వాడ రామారావు, వార్డ్ మెంబర్లు, చెన్నారావు, సీతారాం, అప్పారావు, రామారావు, కెల్లా లక్ష్మనాయుడు, పిన్నింటి రమణ, గ్రామ గోవింద ఆలయ కమిటీ సిబ్బంది, యువత పెద్దలు, యువత ప్రత్యేక పాల్గొని మహిళలు పాల్గొన్నారు.

క్లస్టర్ విధానంతో పాఠశాల విద్య మరింత బలోపేతం

విశాలాంధ్ర - కవిటి : ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన క్లస్టర్ విధానంతో ప్రాథమిక విద్య మరింత బలోపేతం అవుతుందని ఎంఈవో ధనుంజయ మజ్జి, క్లస్టర్ చైర్మన్లు అన్నారు. శనివారం బొరివంక, రాజపురం, కవిటి, ముత్యాల పేట, ఆర్. బెలగాం, మాణిక్యపురం క్లస్టర్లలో నిర్వహించారు. ఎంఈవో అన్ని క్లస్టర్లను తనిఖీ చేసి ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పాఠశాలలు క్లస్టర్ విధానంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేత అవుతాయని, ప్రతీ ఉపాధ్యాయుడు ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

కనుల పండుగగా సుదర్శన హోమం

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో వెలసివున్న శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి వారి ఆలయంలో కనుల పండుగగా సుదర్శన యాగం చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి వారి ధ్రువమూర్తుల ప్రతిష్టాపన తృతీయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి ఆలయ అర్చకులు సత్యనారాయణ స్వామి, రాజు స్వామి, రాజేష్ స్వామి, రమేష్ స్వామి లచే వేకువ జామున సుప్రభాత సేవ, నవకలిస స్థపనము, అలంకరణ, తీర్థ గోష్టి, సుదర్శన హోమం, మహా పూర్ణాహుతి, కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పొందల కుమారి కృష్ణారావు దంపతులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర - కవిటి : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం నెలకుంటుందని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి అన్నారు.ఈ మేరకు శనివారం బెలగాం గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా అధికారులు స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేశారు.అనంతరం గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పిటిపిఆర్డి శివాజీ పాణిగ్రహి, ఏపీవో టీ మోహనరావు,జెడ్ ఆర్ యు సి సి సభ్యులు రంగా రౌలో, కూటమి నాయకులు సంతోష్ కుమార్ పట్నాయక్,మణి చంద్ర ప్రకాష్,బాసుదేవ్ రౌలో,మృత్యుంజయ పట్నాయక్,సచివాలయ సిబ్బంది, ఎంఎన్ఆర్ ఈజీఎస్ సిబ్బంది,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో గల స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్ర పరిచారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటే విద్య చక్కగా అభ్యసించవచ్చని,పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తే పరిశుభ్రతతో అనేక రోగాలను దరిచేరనీయకుండా వుండవచ్చని అన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. పి.ఒ. జె పాపారావు, జి విష్ణు మూర్తి, పి హరి, బి అంజనా, డి. రమేష్, ఎల్. ఆనంద్,లోకేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్విజె విద్యాసంస్థలలో... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు మేరకు ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ భారత్ కార్యక్రమం లో భాగంగా ఎస్ వి జె కాలేజీ ఆవరణంలో ఎన్ ఎస్ ఎస్ డిగ్రీ,జూనియర్ కళాశాలల విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టి పరిసరాలను పరిశుభ్రం చేశారు.ఈ కార్యక్రమం ఎస్ వి జె డిగ్రీ, క జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్స్,పి ఓ లు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్లైన్ హాజరుతో ఇబ్బందులు పడ్డ ఉపాధ్యాయులు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : తొలి రోజు కాంప్లెక్స్ ఒక పూట సమావేశంలో ఆన్లైన్ హాజరుతో జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని 5.30గంటలు తరువాత వరకూ హాజరు వేసేందుకు అవకాశం లేకుండా చేయడం ఉన్నతాధికారులకు ఎంత మాత్రం తగదని ఎస్టీయు జిల్లా ప్రధానకార్యదర్శి గురుగుబెల్లి రమణ ఒక ప్రకటనలో ఉన్నతాదధికారుల తీరును తప్పు పట్టారు. మరుసటి రోజు ఆదివారం శెలవు దినం అవడం వల్ల ఉద్యోగులు సొంత ఊళ్ళకు వెళ్లేవారు ఉంటారని అందువల్ల తీవ్ర అసౌకర్యానికి గురయ్యారని బయోమెట్రిక్ హాజరు కానీ కారణంగా అందరూ అవస్థలు పడ్డారని భవిష్యత్లో లోటు పాట్లు నివారించి 5 లోపు కాంప్లెక్స్ సమావేశాలు ముగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు హితవు పలికారు.

రోడ్లపై మలవిసర్జన చేస్తే ఫైన్ విధిస్తాం

విశాలాంధ్ర - పొందూరు : సర్కారు ఎంతో మంచి ఆలోచనతో, ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవటానికి సీసీ రోడ్లు నిర్మాణం చేస్తే పారిశుద్యాన్ని పట్టించుకోకుండా రోడ్లపై మలవిసర్జన చేసినా.. వీధుల్లో పశువులను విచ్చలవిడిగా పెంపకం చేసినా ఫైన్ విధిస్తామని ఎంపీడీవో మన్మధరావు, మేజరుపంచాయతీ ఈవో మోహన్ బాబులు హెచ్చరించారు. ప్రజా ఆరోగ్యం కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పారిశుధ్యాన్ని పాటించాలని కోరారు. మండలకేంద్రం పొందూరులో ఇంటింటికి వెళ్ళి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆరుబయట మలవిసర్జన వ్యక్తిగతంగా, సామాజికంగా మంచిది కాదని, పలురోగాలకు అంటువ్యాధులకు కారణమవుతుందని చెప్పారు. ఆరుబయట మలవిసర్జన మానుకోవాలని తప్పనిసరి పరిస్తితుల్లో పట్టణప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఆరుబయట మలవిసర్జనకు పాల్పడితే జరీ మానా విదిస్తామని హెచ్చరించారు.ఆరోగ్యకార్యకర్తలు, ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బందితో ఇంటింటికి వెళ్ళి వ్యక్తిగతపారిశుద్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

వన్ ధన్ వికాస కేంద్రం ద్వారా గిరిజన మహిళలకు ఉపాధి

విశాలాంధ్ర - మందస : వన్ ధన్ వికాస కేంద్రాల ద్వారా గిరిజన మహిళలకు ఉపాధితో పాటు ఆదాయం మెరుగు పడుతుందని సీతంపేట ఐటిడిఏ ఆదనపు పదక సంచాలకులు డాక్టర్ సన్యాసిరావు తెలిపారు. శనివారం మండల పరిధిలోగల కొండలోగాం పంచాయితీ లోగల జీడి పిక్కల ప్రాసెసింగ్ సెంటర్ ను పరిశీలిస్తూ మాట్లాడారు. మండల పరిధిలోగల అన్ని వీడివీకేలు కూడా రన్నింగ్ కండిషన్లో ఉండాలని నిత్యం గిరిజనుల ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేస్తూ ఆదా యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. రైతుల నుంచి జీడిపిక్కలను సేకరించి కేంద్రాలను నడిపించాలని సిబ్బందికి తెలిపారు.ఈ కార్యక్రమం లో వెలుగు ఏపిఎం పైడి కూర్మారావు తో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్లు ముఖలింగం,తారక మోహన్, రాజా, జగబంధు, ఆనంద్ వీ.డి.వీ.కే. ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ సమావేశాలు వేదికగా మారాలి : ఎంఈఓ రాంబాబు

విశాలాంధ్ర - హిరమండలం : వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో, మరింత పటిష్టమైన బోధనలు అమలు చేయాలంటే కాంప్లెక్స్ సమావేశాలు వేదికగా, మారాలని, మండల విద్యాశాఖ అధికారి, కె.రాంబాబు అన్నారు. శనివారం హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎం ఈ ఓ కిలారి రాంబాబు హాజరై మాట్లాడుతూ జీవో నెంబర్ .117. ను. ప్రభుత్వం ప్రక్షాళన చేస్తూ, కొత్తగా ఈ కాంప్లెక్స్ సమావేశాలను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు, గాను, ఈ వర్క్ షాప్ లో ఒకటి రెండు తరగతులు బోధించే టీచర్లకు, ఒక విభాగం. మూడు నాలుగు ఐదు తరగతుల బోధించే టీచర్లకు మరో విభాగం. మరియు సబ్జెక్ట్ టీచర్లకు మరో విభాగం. కేటాయిస్తూ ఒకే కాంప్లెక్స్ సమావేశంలో మూడు వర్క్ షాపులు నిర్వహిస్తుందని, ఆయన వివరించారు. ఈ సమావేశానికి ముందుగా క్లస్టర్ హెచ్ఎం. టి. కేశవరావు ప్రారంభ ఉపన్యాసము నిర్వహించి, అనంతరము, మిడ్డే మీల్స్ ఈ వర్క్ షాప్‌కు అధ్యక్షత వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఈ వర్క్ షాప్ నిర్వహణ చేపట్టాలని ఆయన సూచించారు. ఎస్.ఏ .వన్, మార్కులు ఆధారంగా సి.డి .గ్రేడ్ విద్యార్థులను గుర్తించి ,వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్లస్టర్ హెచ్ఎం సూచించారు .ప్రభుత్వం తీసుకున్న, ఈ నిర్ణయాన్ని ప్రతి ఉపాధ్యాయుడు, గౌరవించాలని. పాఠశాలలో ప్రధానోపా ధ్యాయులను తన విధుల్లో, తోటి ఉపాధ్యాయులు సహకరించాలని, కొన్ని సందర్భాల్లో సెలవుల్లో వెళ్ళిన ఉపాధ్యాయులు తిరిగి విధుల్లో చేరిన వెంటనే, మెమో క్లాసులు తీసుకొని, సిలబస్ను పూర్తి చేయాలని ఆయన సూచించారు. సబ్జెక్టు బోధనలో ఒకరికి ఒకరు షేర్ చేసుకుని మెరుగైన బోధనా విధానాలను, ప్రతి ఉపాధ్యాయుడు అవలంబించాలని, క్లస్టర్ హెచ్ఎం కేశవరావు వివరించారు. ఈ క్లస్టర్ సమావేశానికి ఈ క్లస్టర్ పరిధిలో ఉన్న సుమారు పది పాఠశాలలకు చెందిన, సుమారు 83 మంది టీచర్లు, డి ఆర్ పి లు, సిఆర్ఎంటి లు తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి వాసుదేవుని బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - మందస : మందసలో కొలువైన శ్రీవాసుదేవుని 16వ బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 17 నుండి 23 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. 14 వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయంలో రాజుల కాలం నుండి ఏట బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. 1744 సంవత్సరంలో మందస సంస్థానానికి విద్వాంసులుగా నరసాపురానికి చెందిన తెలికిచెర్ల కందాడ రామానుజాచార్యస్వామి ఆలయం సంస్థానాచార్యులుగా ఉండేవారు. ఆయన వద్ద త్రిదండి శ్రీమన్నా రాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి, గోపాలచార్య స్వామి శిష్యులుగా ఉండేవారు. అప్పట్లో ఇక్కడ ఉన్న వేద పాఠశాలలో పండితులు విద్యనభ్యసించేవారు. 1950 వరకు ఆలయంలో క్రతువులు జరిగేవి, రాజుల పాలన అనంతరం కొన్ని దశాబ్దాల పాటు ఆలయం మూతపడి శిథిలావస్థకు చేరుకుంది. చిన్నజీయరు స్వామి శ్రీ వాసుదేవ ఆలయ చారిత్రక ప్రాముఖ్యతను గుర్తించి తన గురువు స్మారకార్థం జీర్ణోద్ధరణ చేసేందుకు సంకల్పించి, 2001 నుంచి పునర్నిర్మాణ పనులను చేపట్టారు. ఒరిస్సాకు చెందిన శిల్పకారులను తెప్పించి పూర్వకళాకృతితో ఆలయ నిర్మాణం జరిపారు. 2009లో ఆలయాన్ని పునః ప్రతిష్ఠించారు. ఆలయంలో రాజుల పాలన కాలంలో ఉన్న విగ్రహాన్నే పునఃప్రతిష్ఠించారు. ఆలయంలో ఉన్న వాసుదేవ పెరుమాళ్ విగ్రహ నిజరూపం తిరుపతిలో ఉన్న వెంకటేశ్వర స్వామి విగ్రహం మాదిరిగానే ఉండడం, పూరీ జగన్నాథ స్వామి ఆలయం మాదిరిగా కనువిందు చేసే కళాఖండాలతో శ్రీ వాసుదేవ పెరుమాళుని ఆలయాన్ని దర్శించిన భక్తులు మంత్రముగ్ధులవుతారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావద్దు

మందస ఎస్.ఐ కె.కృష్ణ ప్రసాద్

విశాలాంధ్ర - మందస : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మందస ఎస్.ఐ కె.కృష్ణ ప్రసాద్ అన్నారు. 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా శనివారం, హరిపురం, శాతవాహన కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కసారి వాడి చూద్దామని, మత్తు కు బానిసై చేసిన తప్పుకు యువత కాలక్రమేణా తన జీవితంతో పాటు తనపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యుల జీవితాలు ఛిద్రమౌతాయన్నారు. మాదక ద్రవ్యాల విక్రయ ముఠాలపైన, వినియోగించేవారిపైన గట్టి నిఘా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. యువత సిగరెట్, గుట్కా, పాన్‌మసాలా, గంజాయి వంటి వాటి జోలికి పోవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో బి.శివ, జూనియర్ మరియు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌లు బి.దుదిష్టి నాయుడు, ఎం.భాస్కరరావు, ఎన్.ఎస్.ఎస్ పీఓలు ఎన్.రామకుమార్, బి.శాంతారావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చండి

విశాలాంధ్ర - కొత్తూరు : విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించే దిశగా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని నివగాం క్లస్టర్ ప్రధానోపాధ్యాయని ఎస్.నిర్మల అన్నారు. ఎస్.సి.ఇ.ఆర్.టి. నిర్దేశాల మేరకు నివగాం క్లస్టర్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులకు నివగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణా తరగతులు ఆమె అధ్యక్షతన నిర్వహించారు. శిక్షణా తరగతులను ప్రారంభించిన సందర్భంగా నిర్మల మాట్లాడుతూ క్లస్టర్ల ఏర్పాటు ప్రక్రియలో మార్గదర్శక సూత్రాలను పాటించామని, 117 జీ.వో. రద్దు అనంతర పరిస్థితులను విశ్లేషించామని తగు నివేదికను జిల్లా యాజమాన్యానికి పంపామని అన్నారు. మాతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొంతల వెంకట రమణ, కుంటిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయని ధర్మాన కృష్ణవేణి, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ వల్ల రాధిక, రిసోర్స్ పర్సన్లు ఉరిటి ఉమామహేశ్వరరావు, అందవరపు రాజేష్, వై.అప్పలనాయుడు, రామకృష్ణ బడిత్య, ఎం.మురళీకృష్ణ, బాలరాజు మహంతి, పి.రామరాజు, ఎం.దామోదర్, పి.ఋషిదాసులు శిక్షణా తరగతులను నిర్వహించారు. సెకండరీ గ్రేడ్ టీచర్లతో పాటు తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రోపాధ్యాయులందరితో వీరంతా విద్యాభివృద్ధికి అంశా లను చర్చించారు. గొర్లె శంకర నారాయణ, కుదమ తిరుమలరావు, జె.లక్ష్మీకాంతం, కె.దయానిధి, ఎన్.ఉషారాణి, గుర్రాల కృష్ణారావు, బూడిద సంతోష్ కుమార్, పైసక్కి చంద్రశేఖరం, యిసై సౌజన్యవతి, బొమ్మాళి నాగేశ్వరరావు, పెయ్యల సుజాత తదితరులు పలు చర్చలలో పాల్గొని తగు నివేదికలు రూపొందించిరి. ఫిబ్రవరి నెల సిలబస్ ను ఏ మేరకు పూర్తి చేసి రివిజన్ నిర్వహించి విద్యార్థులకు గుణాత్మక విద్యను అందజేయాలో శిక్షణార్థులంతా చర్చించిరి.

ఐతమ్ విద్యార్థులకు కమ్యూనికేషన్ పై అవగాహన

విశాలాంధ్ర - టెక్కలి : ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిటెక్ ఈసిఈ విద్యార్థులకు కమ్యూనికేషన్ రంగంపై రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్, విజయవాడ దూరదర్శన్ కేంద్రం అధిపతి డాక్టర్ డి.రంగనాథం శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమర్జింగ్ వైర్లెస్ మరియు బ్రాడ్ కాస్ట్ టెక్నాజీస్ - 5జి అనే అంశంపై ఆయన ప్రసంగించారు. భారత్ ఒక ఏడాదిలో 4 లక్షల బిటిఎస్ మొబైల్ స్టేషన్లను రూపకల్పన చేసిందని ప్రస్తుతం, 5జి, 6జి సేవలను అందిస్తుందన్నారు. దేశంలో 96శాతం వరకు 5జి సేవలు అందుబాటులో ఉన్నాయని, జియో, ఎయిర్టెల్ సంస్థలు అత్యధిక వ్యయంతో సేవలను అందిస్తున్నాయన్నారు. చెన్నై, కాన్పూరు, ముంబై ఐఐటి విద్యార్థులు 5జి అభివృద్ధి చేయడంలో కృషిచేశారన్నారు. ప్రస్తుతం 6జి సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు భారత ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. కమ్యూనికేషన్ రంగంలో భవిష్యత్లో దాదాపు 25 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించ బడతాయని విద్యార్థులు అత్యధిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్.శ్రీనివాసరావులు, హెచ్ఐడి డాక్టర్ వి.అశోక్ కుమార్, డాక్టర్ డి.యుగంధర్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రజకుల అభివృద్ధి సాధ్యం

రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము

విశాలాంధ్ర - రణస్థలం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే రజకుల అభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రజకులు అనేక ఇబ్బందులకు గురయ్యారని అందుకనే ఓటుతోనే వైసీపీకి రజకులు బుద్ధి చెప్పారని ఆయన ఆరోపించారు రజకులు అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా ఆదరణ త్రీ -3 పథకం పెట్టి కులవృత్తిదారులందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన ఆశయమన్నారు. రజకులకు ఆధునిక పరికరాలను అందించి ఆ కుటుంబాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో సాయం చేస్తుందని వృత్తినే నమ్ముకున్నటువంటి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే అధునాతన పరికరాలను ద్వారా సాధ్యపడుతుందని ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం రజకులు అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. రజకులు అభివృద్ధి కొరకై అధునోతన దోబీ ఘాట్లను ఏర్పాటు చేయాలని అలాగే పాత దోబిగాట్లను తక్షణమే రిపేరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులు ఆదేశించడంపై డైరెక్టర్ గురజాపు రాము అభినందన తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. అలాగే బీసీలకు రక్షణ చట్టం కై సబ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కుల వృత్తులు చేసుకొని కుటుంబాలకు తలసరి ఆదాయం పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ముఖ్య మంత్రి ఆదేశించడం పట్ల డైరెక్టర్ రాము కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

శుభ్రతపై ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రచారం

విశాలాంధ్ర - టెక్కలి : ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్థానిక కె.కొత్తూరు గ్రామ ప్రజలకు పరిశుభ్రతా-పారిశుద్యంపై శనివారం అవగాహన కల్పించారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న స్వచ్ఛత ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా తడిచెత్త, పొడిచెత్త వేరు చేయుట వల్ల కలిగే ప్రయోజనాలపై ఇంటింటి ప్రచారం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావుల ఆదేశం మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.వి. మారుతీ ప్రసాద్, అధ్యాపకులు కె.వి.ఎస్.సూర్య నారాయణ, శాక్ ఇన్చార్జ జె.సురేష్ కుమార్, చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

వ్యవసాయ శాఖ అధికారి త్రినాథస్వామి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : శ్రీకాకుళం జిల్లాలోని ప్రతీ రైతు.. రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పని సరిగా చేయించుకోవాలని శ్రీకాకుళం జిల్లా వ్యవసాయాధికారి కోరాడ త్రినాథస్వామి రైతులకు సూచించారు. సంతబొమ్మాళి మండలం బోరుభద్ర రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు జరుగుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. రానున్న రోజుల్లో వ్యవసాయ మరియు అనుబంధశాఖల అద్వైర్యంలో అమలు కాబోయే ప్రతీ కార్యక్రమానికి ప్రతీ రైతు తమ యొక్క రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కలిగి ఉండడం తప్పని సరి. క్షేత్రస్థాయిలో నమోదును వేగవంతం చేయాలని వ్యవసాయ సహాయకులకు సూచించారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి మండల వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు, బోరుభద్ర వ్యవసాయ సహాయకురాలు ఐక మోహిని, అభ్యుదయ రైతులు వజ్జ ప్రభాకరరావు, మార్పురాము, పొందూరు కృష్ణారావు, పొందురుఅప్పన్న, పాలిన మల్లేసు, మార్పురామారావు, అప్పిని జయవర్ధన్, మార్పు శంకరరావు మొదలగువారు పాల్గొన్నారు.

జిల్లాలో రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు

ప్రమాదాలపై సమీక్ష

ప్రశంసా పత్రాలు, షీల్డ్ లను బహూకరిస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలో 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ముగింపు సమావేశం జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రహదారి భద్రతపై పలువురు నిపుణులు, అధికారులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ ఏడాది జిల్లాలో 889 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, వాటిలో 285 మంది మరణించగా, 1043 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం వంటి కారణాల వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. వేగ నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల పట్ల, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలపై దృష్టి సారించాలని నిర్ణయించారు. ముఖ్యంగా యువతలో ట్రాఫిక్ సెన్స్ పెంపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో ఉప రవాణా కమిషనర్ విజయ సారధి మాట్లాడుతూ, రహదారి భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత కఠినంగా నిబంధనలు అమలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, ఆర్ అండ్ బి ఎస్ ఈ జాన్ సుధాకర్, డిఎంహెచ్ఓ టీవీ బాలమురళీకృష్ణ, జిల్లా ఫైర్ ఆఫీసర్ మోహన్ రావు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు పీవీ. గంగాధర్, ఆర్.అనిల్, మున్సిపల్ ఇంజనీర్ దక్షిణామూర్తి, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఉజ్వల్, రవాణా శాఖ అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలు వీరే... జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లాలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు, షీల్డ్ లను ఈ సందర్భంగా బహుకరించారు.

గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులు అరెస్ట్

11.56 కిలోల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర-పలాస: పలాస రైల్వేస్టేషన్ కేంద్రంగా రెండు వేరు వేరు కేసులలో అక్రమంగా గంజాయి రవాణాకు పాల్పడతున్న నలుగురు నింధితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 11.56 కిలోల గంజాయిని, మూడు సెల్‌ఫోన్స్, మూడు వేల రూపాయలు నగదును స్వాదీనం చేసుకోవడం జరిగిందని కాశీబుగ్గ డిఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసిస్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నింధితుల వివరాలను వెల్లడించారు. మొదటి కేసులో ఒరిస్సా గంజాం బురయ్ వహదాన్ గ్రామానికి చెందిన బిక్రమ్ మండల్, సునందన సబర్లు అక్రమ రవాణా చేసేందుకు రెండు బ్యాగులలో నాలుగు ప్యాకెట్లు 8.45 కిలోలు గంజాయి పట్టుకొని వలాస రైల్వే స్టేషన్కు వెళుతుండగా వారిని కాశీఉ శీబుగ్గ సిఐ పి. సూర్యనారాయణ, పట్టుకొని గంజాయిని స్వాదీనం చేసుకున్నామన్నారు. మరొక కేసులో హౌదరాబాద్కు చెందిన గంగపైన ఉ దయకుమార్, ఒరిస్సా రాయఘడ బ్లాక్ గండహతి గ్రామానికి చెందిన గౌరవ్ పొరిదాలు 3.11 కిలోల గంజాయిని ముంబాయి ప్రాంతానికి అక్రమంగా రవాణా చేసేందుకు పలాస రైల్వేస్టేషన్లో సిద్ధపడుతుండగా వారిని కాశీబుగ్గ సిఐ పి. సూర్యనారాయణ అరెస్టు చేసి వారి వద్ద నుంచి గంజాయిని స్వాదీనం చేసుకున్నామన్నారు. ఈ రెండు కేసులలో గంజాయి పండించిన వారు, కొనుగోలు చేసిన వారు, విక్రయించిన వ్యక్తులుగా ఉన్న గంజాం జిల్లా బుర్రాయ పహడా గ్రామానికి చెందిన జార్విమాన్, ముంబాయికి చెందిన జాఫర్, హైదరాబాద్కు మెయిన్, చింటూ, నందు, ఒరిస్సాకు చెందిన సబీర్లు పరారీలో ఉన్నారని వారిని పట్టుకోవాల్సి ఉ ందన్నారు. పట్టుబడిన నలుగురు నింధితులను కోర్టులో హాజరు పరచనున్నామన్నారు. గంజాయి రవాణా, విక్రయాలలో ఎటువంటి సమాచారం ఉన్న పోలీసులకు అందించాలని, గంజాయి అక్రమరవాణాపై గట్టి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ ఉన్నారు.

ఆదివాసీలకు అండగా వైసిపి ...

- ప్లాంట్ ఏర్పాటుతో ప్రజలకు ముప్పు...
- రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చింతాడ

విశాలాంధ్ర-ఆమదాలవలస: థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేకంగా పోరాటం చేస్తు న్న ఆదివాసీలకు అండగా వివిధ ప్రజా సంఘాల తో పాటు వైసీపీ ఉంటుందని ఆ పార్టీ సమన్వ యకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. పవర్ ప్లాంట్ వద్దు పర్యావరణం ముద్దు, అలాగే ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటం చేయా లని రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది. నియోజకవర్గం పరిధి సరుబుజ్జిలి, బూర్జ మండలాలకు అనుకొని వెన్నెలవలస సమీపంలో కూటమి ప్రభుత్వం, థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించడం, స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ కూడా 30 వేల కోట్ల రూపాయలతో 3200 వేల మెగావాట్ల విద్యుత్ థర్మల్ పవర్ ప్లాంటేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రక టించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఆ ప్రాంత ప్రజలు, గిరిజనులు వ్యతి రేకిస్తున్న విషయం తెలిసిందే. వారికి తోడుగా వైసిపితో పాటు వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు వ్యతి రేకిస్తూ వస్తున్నాయి. ప్రభుత్వంపై పోరాటంలో భాగంగా ఇప్పటికే కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ సభ్యులు గిరిజన, ఆదివాసీ హక్కుల పరి రక్షణ కమిటీ నాయకుడు వాబయోగి, సోంపేట - కాకరపల్లి థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట సమితి నాయకుడు బీన డిల్లేశ్వరరావుతో కలిసి వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస గ్రామంలో శుక్రవారం పర్యటించి అక్కడ ప్రజలను కలిసి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నా రు. వైసిపి ఆదివాసీల మనోభావాలను గౌరవిస్తుం దని వారి హక్కుల కోసం కృషి చేస్తుందన్నారు. ప్రజలకు, పర్యావరణానికి హాని కలిగించే ప్లాంట్ నిర్మాణానికి జరిగే పోరాటానికి, తమ మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా అక్కడ ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అన్యాయంగా గిరిజనులకు, సామాన్య ప్రజలకు అసౌకర్యం కలిగించే ఏది చేపట్టిన దానికి వ్యతి రేకంగా ప్రజా సంఘాలు, మేధావులు, పౌరులు తలపెట్టే పోరాటానికి ప్రజల పక్షాన పోరాడటానికి మేము సిద్ధంగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్ర మంలో సరుబుజ్జిలి జడ్పిటిసి సురవరపు నాగేశ్వ రరావు,బూర్జ మండల పార్టీ అధ్యక్షుడు నాయకు లు దుంపల శ్యామలరావు, అత్తులూరి రవికాం త్, బొడ్డేపల్లి నాగరాజు సరుబుజ్జిలి బూర్జ థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట సమితి నాయకులు సురేష్ దొర, లక్ష్మణ్ సింహాచలం, అన్నారావు గిరిజనులు పాల్గొన్నారు.

పెళ్లి సరదా తీరకుండానే.. యువకుడు దుర్మరణం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: పెళ్లి సరదా తీరకుండానే ఆ యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. గతేడాది ఇదే సమయంలోనే తండ్రి చనిపోవడంతో అతని ఉద్యోగం ఓ వైపు రావల్సిఉండగా, మరోవైపు పెళ్లి జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆ యువకుడ్ని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసింది. వివరాల్లోకి వెళితే.. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం కుడ్డపల్లి గ్రామానికి చెందిన సవర నవీన్ కుమార్ (21) తనతో పెళ్లి నిశ్చితార్థమైన బిడ్డిక కళ్యాణి (భామిని మండలం మూలగూడ)తో కలిసి విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తుండగా కుశాలపురం బైపాస్ జంక్షన్ జాతీయ రహదారిపై శనివారం ఉదయం 4.48 గంటల సమయంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొనడంతో నవీన్ కుమార్ అక్కడక్కడే మృతిచెందాడు. విజయవాడలో ఉంటున్న కళ్యాణి విశాఖపట్నం వచ్చిందని తెలిసి ఆమెను స్వగ్రామానికి తీసుకువెళ్లేందుకు మోటారు బైక్పై వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన కళ్యాణిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. మృతుడు తండ్రి సవర అనప పోలీసు హెడ్ కానిస్టేబుల్గా పనిచేస్తూ అనారోగ్యంతో గతేడాది మార్చిలో మృతిచెందాడు. తండ్రి ఉద్యోగం కారుణ్య నియామకం కింద నవీన్కుమార్కు ఓ వైపు రావల్సిఉండగా, మరో వైపు నిశ్చితార్థం జరిగిన యువతితో వివాహం జరగాల్సిఉంది. ఈ పరిస్థితుల్లో నవీన్ కుమార్ మృతితో ఆ కుటుంబాలు రోధిస్తున్నారు. మృతునికి తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. మృతుడు తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వలస కూలీలను నిరోధించి ఉపాధి హామీ పనులు కల్పించాలి

వ్య.కా.స జిల్లా ప్రధాన కార్యదర్శి లండ వెంకట్రావు

విశాలాంధ్ర మెళియాపుట్టి: గ్రామాల నుండి ఉపాధి నిమిత్తం వేరువేరు ప్రాంతాలకు వెళ్తున్న వలస కూలీలను నిరోధించి స్థానికంగా ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లాండ వెంకటరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి కే ఎం యు) పిలుపు మేరకు శనివారం ఆయన శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండల పరిధిలో ఆయన దీనికి సంబంధించి కరపత్రాలను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనే ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పనిదినాలు కల్పించి, రోజు వేతనం 700 రూపాయలు ఇవ్వాలని, మెటీరియల్ కాంపోనెంట్ను రాష్ట్ర ప్రభుత్వమే భరించి, గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ఉపాధి కూలీల చేత చేయించాల్సిన పనులను కాంట్రాక్టర్లతో, యంత్రాలతో చేయిస్తూ, పేదల కడుపులు కొడుతున్నారని, ఉపాధి హామీ పనులకోసం అధికారుల చుట్టూ తిరిగినా పనులు కల్పించడంలో అలసత్వం చేస్తున్నారని, అలాగే చేసిన పనులకు సంబంధించి నెలల తరబడి బిల్లులు చెల్లింపులలో ఆలసత్వం జరుగు తుందన్నారు. మన రాష్ట్రంలో చేసిన పనికి ఉపాధి హామీలో కోట్లాది రూపాయలు బకాయిలు ఉన్నాయన్నారు. దీనికి సంబంధించి అనేక అంశాల పై మాట్లాడారు.